# అమ్మాయి నచ్చింది

"అమ్మాయి నచ్చింది..." అన్నారు అబ్బాయి తరఫు వాళ్ళు.

"మాకూ అబ్బాయి నచ్చాడు...కానీ..." అని అర్థోక్తిగా ఆగాడు అమ్మాయి తండ్రి.

"కానీ....ఏమిటి?"

"అమ్మాయి అబ్బాయితో మాట్లాడాలి..."

"మాట్లాడమనండి..." అన్నది అబ్బాయి తల్లి.

"అహఁ...ఇలా కాదు...ప్రత్యేకంగా...వేరే గదిలో!...అమ్మాయికి పూర్తిగా నచ్చితేనే పెళ్ళి..." అన్నది అమ్మాయి తల్లి.

అటూ ఇటూ ముఖముఖాలు చూసుకున్నారు. గుసగుసగా మాట్లాడుకున్నారు.

"సరే కానివ్వండి..."

"అయితే మేము విన్నదంతా నిజమే నన్న మాట..." అన్నాడు అబ్బాయి సుధీర్.

ఇద్దరూ వేరే గదిలో కెళ్ళి కూచున్నాక అతను ఆమెను మరింత పరిశీలనగా చూశాడు. చాలా బాగుంది అమ్మాయి. చంద్రిక అనే పేరుకు తగినట్టు నిలువెల్లా కోమలత్వం తొణికిస లాడుతూ ఉంది.

"ఏం విన్నారు?..." అన్నది చంద్రిక సూటిగా.

"మీకు ఇదివరకు చాలా సార్లు పెళ్ళిచూపులు అయ్యాయని తెలిసింది. చాలా మందికి మీరు నచ్చారు...ఆస్తి అంతస్తు లాంఛనాలు అన్నీ సరిపోయాయి కూడా...అయినా చివరగా మీరు అబ్బాయితో వేరుగా మాట్లాడ్డం...ఆ తరువాత సంబంధం కుదరకుండా వెళ్ళిపోవడం జరుగుతూ ఉంది...నిజమే కదూ?..." ఖచ్చితంగా అడిగేశాడు సుధీర్.

"ఓహ్! ఎవరు చెప్పారోగాని అంతా సరిగ్గా తెలిసింది మీకు...కాని అసలు విషయం ఏమిటో మాత్రం తెలిసి ఉండదు..."

"తెలీదు...రకరకాల వ్యాఖ్యానాలు ఉన్నాయి మరి..." అంటూ చిన్నగా నవ్వాడు సుధీర్. "ఏకాంతంలో మీరు ఏవో పెంకె ప్రశ్నలు వేసి ఉండవచ్చు... మీకు నిజానికి పెళ్ళి ఇష్టం లేక పోయినా పెద్దల బలవంతం మీద పెళ్ళి చూపులు మాత్రం జరిగి ఉండవచ్చు...మీరు మరెవరినో ప్రేమించి ఉండవచ్చు... మరి వేరే వ్యక్తినే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారో...లేక ప్రేమను మరిచి పోలేక జీవితాంతం ఒంటరిగా ఉండి పోవా లనుకుంటున్నారో...ఏమైతేనేం... పెళ్ళికి మాత్రం ఒప్పుకో వద్దని అబ్బాయిని ప్రయివేటుగా ప్రాధేయ పడి ఉండ వచ్చు...మీ గుట్టు రట్టు చెయ్యి వద్దని ప్రమాణం తీసుకుని ఉండ వచ్చు... అసలు విషయం మాత్ర ఖచ్చితంగా ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు...మిస్టరీగానే ఉంది..."

"అయితే మీకూ ఏవో అనుమానాలు ఉండాలి..." ఆరా తీస్తూ అతని ముఖాన్ని పరిశీలించింది చంద్రిక.

హాయిగా నవ్వేశాడు సుధీర్. "అనుమానం కాదు గాని నా విషయంలో మీ నిర్ణయం ఎలా ఉంటుందా అని కుతూహలం మాత్రం చాలా ఉంది...మా వాళ్ళు నా నిర్ణయాన్ని ఎప్పుడూ కాదనరు. చెప్పండి...ఇంతకీ అసలు సంగతి ఏమిటి? కట్నకానుకలు లాంఛనాలు వగైరా ప్రసక్తే ఉండ కూడదు అంటారా?... మీరు స్పష్టంగా చెప్పెయ్యండి...మా వాళ్ళని నేను ఒప్పించుకుంటాను...మీరు కట్టుబట్టలతో వచ్చినా సరే...చేసుకుంటాను..."

అతని మాటల్లోని నిజాయితీకి మగ్ధురా లయింది చంద్రిక. "మీరు ఎలా ప్రమాణం చేస్తారు?" అని అడిగింది.

"అంటే?..."

"ఎవరికైనా ఏదైనా మాట ఇవ్వాలంటే ఎలా ప్రమాణం చేస్తారు?" అని అడిగింది.

"అంటే?"

"ఎవరికైనా ఏదైనా మాట ఇవ్వాలంటే...ఎలా ప్రమాణం చేస్తారూ అని...? దేవుడి సాక్షిగా అంటారా? భగవద్గీత సాక్షిగా అంటారా?" స్పష్టంగా నెమ్మదిగా అడిగింది చంద్రిక.

"ఓ..." అంటూ ఆమె ముందు తన చెయ్యి చాపాడు సుధీర్.

అసంకల్పితంగా ఆమె కూడా చెయ్యి ముందుకు చాపింది. చేతిలో చెయ్యి వేశాడు. ఒళ్ళు జల్లుమన లేదు. పులకింతల వ్యవహారం కాదు. నమ్మకం. విశ్వాసం. నిజాయితీ. సత్య ప్రమాణం అది.

"అంతరాత్మ సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నాను...మన మాటలు మూడో మనిషికి జన్మలో తెలియవు...ప్రామిస్..."

"థేంక్యూ...అయితే చెప్తాను..." అంటూ ఆ తర్వాత స్వరం తగ్గించి నెమ్మదిగా చెప్పింది చంద్రిక. తల దించుకుంది. పక్క చూపులే గాని అతని వైపు చూడ్డం కూడా లేదు. ఆగి ఆగి చెప్పింది. బాధనంతా మెల్ల మెల్లగా బయట పెట్టింది. ఏడుపే రాబోయినా బలవంతంగా అణిచి పెట్టుకుంది. దాదాపు అరగంట సేపు పట్టింది. మొత్తానికి చెప్పేసింది. కాస్సేపటికే తేరుకుని అతని వైపు చూసింది.

"దాచలేదు...చెప్పేశాను...ఇక మీ ఇష్టం...కాని మీరు చేసిన ప్రమాణం..."

అంతసేపూ కదలకుండా ఉండి పోయిన సుధీర్ అప్పుడే కదిలాడు. "ఇది వరకు పెళ్ళి చూపుల్లో అబ్బాయి లందరి నుంచి ఇలాగే ప్రమాణాలు తీసుకుని ఉంటారు...నిజంగా వాళ్ళంతా గొప్ప వాళ్ళే... ఎవ్వరూ ఎక్కడా బయట పెట్ట లేదు...ఎక్కడా పొక్క లేదు..."

"అదీ నా అదృష్టమే...మరి మీ ప్రమాణం?"

"తప్పను...ఎవరితోనూ చెప్పను...మళ్ళీ ప్రామిస్..." అన్నాడు సుధీర్... "కాని సంబంధం ఏమైనట్టు?"

ఆశ్చర్యపోతూ అడిగింది: "అదేమిటి?...మీ అభిప్రాయం మారి పోలేదా?..."

"లేదు...నా కిష్టమే...ఇంకా ఎక్కువ ఇష్టం..."

"బాగా ఆలోచించు కోండి...తరువాత బాధ పడతారు..."

"బాధపడే ప్రసక్తే లేదు...ఇదీ ప్రామిస్సే...మీ అభిప్రాయమే తెలియాలి..."

"నాకు భయమేస్తోంది...ఇప్పటికీ మీకు ఇష్ట మైతే...నాకు అభ్యంతరం లేదు..."

ఎక్కడో మోగాయి బాజా భజంత్రీలు.

రసరమ్యమైన శోభనం రాత్రి. సుధీర్ ఉత్సాహంగా ఎదురు

చూస్తున్నాడు.

పూల కన్యలా వచ్చింది చంద్రిక. "నమ్మలేకుండా ఉన్నాను. ఇది కలో నిజమో తెలీదు..." అంది.

ఆమెను చనువుగా దగ్గరకు తీసుకుని భుజం మీద చిన్నగా గిల్లి "నిజమే కదా" అన్నాడు సుధీర్.

ఎన్నెన్నో మాట్లాడాలని ఆమెకు ఉంది. అతనికి మాత్రం మాటల మీద ఆసక్తి ఉన్నట్టే లేదు. ఎదురు చూస్తున్న అనుభవం కోసం తహతహ లాడుతున్నాడు.

ఆమెకు వింతగా అనిపించింది. ఇటువంటి విషయాల్లో మొగవాళ్ళు ఇది వరకే గీత దాటి ఉండడం సహజం. ఎక్కడో ఒక చోట తొలి శృంగారం రుచి చూసే అవకాశాలు ఉంటాయి. మరి సుధీర్ అటువంటి వాడు కాడా? లేక చాలా భయస్తుడేమో!

"భయమా?" అని అతను అడుగుతుంటే నవ్వు వచ్చింది. స్వేచ్ఛగా మాట్లాడుకోవడం ఇద్దరికీ ఈసరికే బాగా అలవాటయింది. దాపరికాలు ఉండ నవసరం లేదు.

"మీ సంగతేమిటి?...మీకు ఇంత వరకు ఎవ్వరితోనూ..." అని సగంలో ఆపింది.

"అహ...మరీ పులిరాజాను కాను గాని..." అంటూ గలగలా నవ్వాడు.

"మరీ ఏమిటో తొందర పడుతున్నారూ..."

"తొందరే కదూ...నువ్వు చెప్పిన రహస్యం...ఇంతకీ ఎలా ఉంటుందో ఏమిటోననీ..." అంటూనే చేతులకు పని చెప్పాడు.

"నాకు సిగ్గు..."

ట్యూబ్ లైట్ ఆఫ్ చేశాడు. నీలి రంగు బెడ్ లైట్ వేశాడు. బైట వెన్నెల తేటగా వెలుగుతోంది.

సిగ్గే సింగారం అంటూ మెల్ల మెల్లగా చనువు పెంచుకుంటూ పెదవులకు పని కల్పించాడు. ఆ తరువాత పైట తొలగింది. అతని శ్వాస ఆమె మెడ మీద నాట్యం చేసింది. ఆమె వివశత్వంతో వెనక్కి వాలింది. లీలగా అర్థమౌతోంది. మరీ పులిరాజా లాగా కాదు గాని సుధీర్‌కు ఎప్పుడు ఎలా మెలగాలో తెలుసు. జాకెట్ హుక్స్ విడదీయడం తెలుసు. ఆబగా తడుముకోవడం లేదతను. స్థిరంగా ఉన్నాడు. తెలిసిన వాడిలా ఉన్నాడు. చతురంగ బలాలు ఒక్క చేతి సైగతో

శాసించగల సైన్యాధికారిలా ఉన్నాడు. లేకుంటే అంత చాకచక్యంగా బ్రా హుక్స్ ఎలాగ తప్పించాడు?

ఒక్కసారిగా తల పక్కకు తిప్పి కళ్ళు గట్టిగా మూసుకుంది. అప్పుడు అనిపించింది భయం. అతను తిడతాడేమో! కొడతాడేమో!

కళ్ళు తెరవకనే గమనిస్తోంది. ఆమె ఒళ్ళంతా కళ్ళయినట్టు అతని ప్రతి కదలికా తెలుస్తూ ఉంది.

అతను చూశాడు. చూసేశాడు. కళ్ళారా చూశాడు. చూసుకుంటున్నాడు. కుడి. ఎడమ. ఎడమ. కుడి. అటు నుంచి ఇటు. ఇటు నుంచి అటు. మార్చి మార్చి చూశాడు. తల వంచి చూశాడు. మళ్ళీ కొంచెం తల వెనక్కి వాల్చి చూశాడు. ఆమె నడుము మీద చేతులు వేసి ఆమెను కొంచెం అటు తిప్పాడు. కొంచెం ఇటు తిప్పాడు. మళ్ళీ చూశాడు. చూసుకున్నాడు.

కాలం ఆగి పోయినట్టు శూన్యంలో పడి కాళ్ళూ చేతులూ కొట్టు కుంటున్నట్టు నిర్లిప్త స్థితిలో ఉండి పోయింది చంద్రిక. కొద్ది క్షణాలలో ఆమె ముఖం మీద వేడి తుపాను వీచింది. వడగాడ్పులు కళ్ళను రాసుకున్నాయి. అతని పెదవులు కళ్ళ మీద వాలినట్టు తెలిసింది. ముద్దులతో ముద్ర వేశాడు. నవ్వుతూ అన్నాడు: “ఇవి రెండూ...రెండు రహస్యాలు కదూ?...” అంటూ కిందకి చేతులు వాల్చాడు. మొదట అనిపించింది మేఘాలు వాలాయని. తర్వాత విద్యుత్తు పాకింది. అంతలో కెరటాలు విరిగి పడ్డాయి.

“నిజంగా మీకు నచ్చలేదు కదూ?” అంది వేదన అంతా గొంతు లోనే నొక్కుకుంటూ.

“ఇప్పుడు మాట్లాడకు...” అన్నాడు సుధీర్.

అసలు మాట్లాడ నివ్వలేదు.

తెల్లవారు జాముకి ఇద్దరూ అలిసి పోయారు. కొంచెం నిద్ర. కొంచెం మత్తు. చాలా ఆనందం.

అతని చేతులు మాత్రం ఆమె ఎద నుంచి వదలడం లేదు. కదులుతూనే ఉన్నాయి. అప్పుడప్పుడూ ఆగి వంగి ముద్దు పెట్టు కుంటూనే ఉన్నాడు. ఆమె కళ్ళలో సుడి తిరిగిన ఆనంద బాష్పాలు తెరకట్టాయి.

“అసలు ఎవరైనా నన్ను ఇష్ట పడతా రనుకో లేదు...అంతా పర్ఫెక్ట్‌గా ఉండాలని కదా మగవాళ్ళు అనుకుంటారు?...”

"ష..." అన్నాడు సుధీర్. రసభంగం అయినట్టు కళ్ళు చిట్లించాడు. మళ్ళీ ఆమె ఎద వైపే చూసుకుంటూ కొంటెగానూ రసవత్తరంగానూ చెప్పాడు... "కుడి రహస్యం చిన్నది...ఎడమ రహస్యం పెద్దది...జీవితాంతం ఈ రహస్యాలను మనలోనే దాచు కుందాం...ఎవ్వరికీ తెలియదు...నువ్వు మీ అమ్మకు కూడా చెప్పని రహస్యాన్ని నేను మాత్రం ఎవరికి చెబుతాను?..."

అతని ముఖాన్ని దగ్గరకు తీసుకుని అదుముకుంది.

అతని ఊపిరి ఆమె ఎద మీద కుడి ఎడమగా సుడి తిరుగుతోంది. అతను ముద్దుల మధ్యే మాటలు అద్దుతున్నాడు. "రెండూ ఒక్కలాగే ఉంటే వింత ఏముంది? నాకు అప్పుడప్పుడూ వింతగా అనిపిస్తుంది. చిన్నవిగా ఉంటే గట్టిగా ముచ్చటగా ఉంటుందనీ... పెద్దగా ఉంటే నిండుగా కళ్ళ పండువుగా... చేతులకు అనువుగా ఉంటుందనీ...ఇప్పుడు నీ వల్ల... రెండు ఇష్టాలూ తీరాయి... నేనే అదృష్ట వంతుణ్ణి..."

అతని మాటల్లో అమృతమే చిలుకుతోంది. ఆమె పరవశంలో తలమునక లవుతోంది. "కాని మీరు చాలా రిస్క్ తీసుకున్నారు...పెళ్ళిచూపుల్లో అలా చెప్పాను కానీ నిజంగా ఎలా ఉంటానో తెలుసుకునే అవకాశం ఇప్పుడే కదా?...మీకు మరీ నచ్చక పోతే జీవితాంతం బాధ పడాలి కదా?..."

ఆ మాటలతో తలెత్తి ఆమె కళ్ళలోకి చూశాడు. కళ్ళు మూసుకుని తృప్తిగా నిట్టూర్చాడు. ఆమె ఎద మీద తల వాల్చి చాలా సేపు సర్దుకుని పడుకున్నాడు.

"అందం అనేది ఎద పైన కాదు...ఎద లోపల ఉండాలి...పెళ్ళయిన తరువాత నిజం తెలిసి ఉంటే చాలా వికారంగా ఉండేది...ముందే చెప్పెయ్యడం నీ నిజాయితీకి నిదర్శనం... ఇంతకంటే అంద మేముంది?" అంటూ పదే పదే ఎద మీద కుడి ఎడమలుగా ముద్దుల వర్షం కురిపించాడు. "అందుకే నాకు ఈ అమ్మాయే నచ్చింది... నచ్చింది..."

16.04.2004 సంచిక